క్లుప్తంగా

పలాస చేరుకున్న వంశధార నీరు



టెక్కలిపట్నం వద్దకు చేరుకున్న వంశధార నీరు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో ఉన్నటువంటి వంశధార ఆయకట్టు రైతులకు ముందస్తుగా శుభవార్త వచ్చింది. గత కొన్నేళ్లుగా సాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఊరట లభించింది. గురువారం సాయంత్రానికి వంశధార నీరు టెక్కలి నుంచి నందిగాం మండలం మీదుగా పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీ పరిసరాల్లోకి చేరుకుంది. మరో రెండు రోజుల్లో వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి గ్రామం వద్దకు సాగునీరు చేరనుంది. వంశధార ఆయకట్టు పరిధిలో పలాస మండలంలో 8,506 ఎకరాలు, వజ్రపుకొత్తూరు మండలం పరిధిలో 10,753 ఎకరాలు సాగు చేయనున్నారు.

'రుణాలను సద్వినియోగం చేసుకోవాలి'



రుణాలు అందజేస్తున్న చిట్టిబాబు

పలాస: బ్యాంకుల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న వివిధ రకాల రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు సూచించారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఎస్టీ రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రైతులకు అన్నివిధాలుగా మేలు జరుగుతోందన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సవర లక్ష్మయ్య, సీఈవో శ్రీనివాసరావు, డీసీసీబీ మేనేజర్ డి.కృష్ణారావు, సూపర్‌వైజర్ ఎర్రయ్య, శ్రీనివాసరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'అంకితభావంతో పనిచేయాలి'



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

నందిగాం: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కణితూరు, లఖిదాసుపురం, దేవళభద్ర సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో జగనన్న సురక్ష, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతాశయంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శివప్రసాద్, నాయకులు సర్లాన భైరాగి, పల్ల అప్పారావు, పొందల లక్ష్మణరావు, నడుపూరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి తదితరులు

కాశీబుగ్గ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని డీఎస్పీ నాగేశ్వరరెడ్డి అన్నారు. కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో ఉన్నటువంటి డివిజన్ కార్యాలయం ఎదురుగా లయన్స్ క్లబ్ క్యాజులాండ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పల్లేటి రాజారామ్, కార్యదర్శి అట్టాడ మాధవరావు, కోశాధికారి రామచంద్రమూర్తి, డైరెక్టర్స్ తంగుడు వైకుంఠరావు, పెంట శివానందస్వామి, ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

కవిటి: తాగునీటి పథకాలకు సంబంధించిన నిర్మాణాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కాంట్రాక్టర్లకు వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ సూచించారు. మండలంలోని డి.గొనపపుట్టుగ పంచాయతీలో నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను గురువారం పరిశీలించారు. పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయనతో పాటు బెందాళం జయప్రకాష్, జల్లు భూషా, కుమార్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కోటబొమ్మాళి: లఖందిడ్డిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటరమణారావు తదితరులు



కంచిలి: కేసరపడలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



సంతబొమ్మాళి: గోవిందపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న పేడాడ తిలక్ తదితరులు

జగనన్న సురక్ష.. అర్హులకు రక్ష

జగనన్న సురక్ష కార్యక్రమం అర్హత ఉన్నా సాంకేతిక కారణాలతో పథకాలు అందుకోలేకపోయిన లబ్ధిదారులకు రక్షణగా నిలుస్తోందని వక్తలు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవరాల్లో జగనన్న సురక్ష క్యాంపులు జోరుగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా సాంకేతిక సమస్యలతో పథకాలు అందనివారి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నారు. కావాల్సిన ధ్రువపత్రాలను వెంటనే జారీ చేస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



టెక్కలి: ధ్రువపత్రాలు అందజేస్తున్న దువ్వాడ వాణి తదితరులు



కంచిలి: అంపురంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి



వజ్రపుకొత్తూరు రూరల్: పెద్ద పల్లివూరులో ధ్రువపత్రాలు అందజేస్తున్న శ్రీనివాసరావు తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: డొంకూరులో ధ్రువపత్రాలు అందజేస్తున్న పిరియా సాయిరాజ్ తదితరులు



కవిటి: లండారిపుట్టుగలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



కాశీబుగ్గ: పద్మనాభపురంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న చైర్మన్ గిరిబాబు తదితరులు



సోంపేట: సుంకిడిలో అర్హులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్



ఇచ్ఛాపురం: రత్తకన్నలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



పీవో కల్పనాకుమారికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన ప్రజాప్రతినిధులు

మందస: ఐటీడీఏ పరిధిలోని మందస మండలంలో గల సమస్యలను పరిష్కరించాలని గిరిజన ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సీతంపేటలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మందసలో గిరిజన సంఘం భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు నిర్మించాలని, కొన్ని ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం డీటీడబ్ల్యూవో మేడిద శ్రీనివాసరావును కలిసి గిరిజన ఆశ్రమాల్లో సక్రమంగా మెనూ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, సర్పంచ్‌లు సవర నవిత, సవర సంధ్య, సవర సుధాకర్, మజ్జి కుమార్‌చంద్ర, ఎంపీటీసీ సవర హరినాథ్, క్లస్టర్ ఇన్‌చార్జి సవర డొంబురు, గిరిజన నాయకులు సవర బాలకృష్ణ, సవర నీలకంఠం, నాగేశ్వరరావు, సవర ఢిల్లీరావు, సవర రాము తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు కృషి



మాట్లాడుతున్న పంచాయతీ అధికారి రమణ

కోటబొమ్మాళి: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు సాధించడం కోసం ప్రతీ పంచాయతీ కార్యదర్శి కృషి చేయాలని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐవీ రమణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులపై పంచాయతీ కార్యదర్శులతో అవగాహన సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలోనూ స్వచ్ఛత, పారిశుద్ధ్య కార్యక్రమాలు తరచూ చేపట్టాలన్నారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం నియమించిన టీమ్ జిల్లాలో పంచాయతీలను స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపికలు చేయనుందన్నారు. అవార్డులకు ఎంపికైతే మన రాష్ట్రానికి మంచిపేరు రానుందని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ టి.రాజారావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్ రేపు

టెక్కలి: స్థానిక కోర్టు సముదాయంలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు కోర్టు సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

వివిధ కేసులకు సంబంధించి తక్షణమే పరిష్కారం చూపేందుకు ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ప్రత్యేక అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పల్లెల ప్రగతికి ప్రభుత్వం కృషి



పనులు పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ రాజు

వజ్రపుకొత్తూరు రూరల్: పల్లెల ప్రగతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని వైస్ ఎంపీపీ వంక రాజు అన్నారు. మండలంలోని మంచినీళ్లపేటలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేశారన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ వంక సత్యరాజ్ ఉన్నారు.

చిన్నారులకు రక్త హీనత నివారణ మాత్రలు

కవిటి: మండలంలోని గొర్లెపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులకు రక్తహీనత నివారణ మాత్రలు ఇచ్చే కార్యక్రమం గురువారం నిర్వహించారు. 1 నుంచి 5 తరగతులకు ఒక డోస్, 6 నుంచి 8 తరగతుల వారికి అధిక డోసు మాత్రలను పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం సీతన్నాయుడు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే పల్లీ చిక్కీలు, రాగిజావ పంపిణీ చేస్తున్న నేపథ్యంలో రక్తహీనత మాత్రల పంపిణీతో ఆశించిన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

గడప గడపలో సంతోషాలు



సన్యాసిపుట్టుగలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- కేశుపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఇచ్ఛాపురం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన నవరత్నాలతో రాష్ట్రంలోని ప్రతి గడపలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని కేశుపురం గ్రామ సచివాలయం పరిధి సన్యాసిపుట్టుగ, నీలాపుట్టుగ గ్రామాల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ డి.లోకేశ్వరరావు, ఎంపీపీ బోర పుష్ప, ఏఎంసీ చైర్మన్ ఎస్.బాబూరావు, సర్పంచ్‌లు గుజ్జు ఢిల్లీరావు, కారంగి త్రినాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎం.చక్రవర్తిరెడ్డి, నీలాపు చంద్రయ్య, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సల్ల దేవరాజు, కారంగి మోహనరావు, దక్కత నూకయ్యరెడ్డి, రంగాల కృష్ణారెడ్డి, కొప్పల హేమంత్, మాసుపత్రి వీరాస్వామి, బాగ మోహనరావు, నీలాపు గోపీ, పనపాన వీరాస్వామి, నీలాపు చంద్రశేఖర్, బుడత ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం గ్రేడింగ్‌కు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాద్

ఇచ్ఛాపురం రూరల్: ప్రతీ స్వయం శక్తి సంఘానికి శతశాతం గ్రేడింగ్ విచ్చేవిధంగా కృషి చేయాలని వెలుగు ఏపీఎం సనపల ప్రసాదరావు సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య సంఘ భవనంలో వీవోఏలతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అన్నిరకాల లావాదేవీలు ఆన్‌లైన్‌లో మొబైల్ బుకింగ్ ద్వారా చేయాలన్నారు. మహిళల జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో పెరటి తోటల్లో మునగ, బొప్పాయి, చిరుధాన్యాలు పండించి వాటిని అందరూ విరివిగా ఉపయోగించాలని సూచించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరుపున బ్యాంకు ద్వారా అందజేస్తున్న పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, ఉమెన్ లెడ్ వంటి సబ్సిడీ రుణాలను ఉపయోగించుకొని చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ కె.రాము, క్లస్టర్ ఎల్‌సీ సాహూ, సీసీలు రామకృష్ణ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మండల సర్వసభ్య సమావేశం నేడు

కంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి వివరాలతో హాజరవ్వాలని కోరారు.

న్యాయ విజ్ఞాన సదస్సు నేడు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ అక్రమ రవాణా వలన దుష్ప్రయోజనాలు, శిక్షలు అనే అంశంపై ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు నేతృత్వంలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

మందస: మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన రోక్కల అనిల్ అనే విద్యార్థి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. 10వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిది పేద కుటుంబం కావడంతో వైద్య పరీక్షల నిమిత్తం సామాజికవేత్త కొర్ల కన్నారావు గురువారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు కొంచాడ సురేష్‌కుమార్, రౌతు చిరంజీవిరావు, గొలుసు మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఇచ్ఛాపురం: బెంతొరియా కులస్తుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం పెద్దలు కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని రత్తకన్న గ్రామంలో గురువారం పర్యటించిన ఆమెకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో జనం మెచ్చే పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తమ సమస్య పరిష్కారమవుతుందనే విశ్వాసంతో ఉన్నామన్నారు. సీఎం దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలని కోరారు.

'శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి'

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేదా హెల్త్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని ఆర్డీఎంఏ జి.నాగరాజుని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ఆర్డీఎంఏ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలను చైర్‌పర్సన్ రాజలక్ష్మి విన్నవించారు.

వీఆర్‌ఏల ధర్నా

పలాస/కవిటి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఆర్‌ఏలు తహసీల్దార్ కార్యాలయాల వద్ద గురువారం ధర్నాలు నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజులు పాటు రిలే నిరాహార దీక్షలు చేయనున్నారు. గ్రామ సహాయకులకు పే స్కేలు చెల్లించాలని, అర్హత ఉన్నవారికి పదోన్నతులు కల్పించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్నటువంటి పారిశుద్ధ్య కార్మికులు గాంధీ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, హెల్త్ అలవెన్సు జీతాలతో పాటు, రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మురగన్‌తో పాటు సీతమ్మ, ఉషా, శంకుంతల, జగ్గముఖి, త్రివేణి, పద్మ, పార్వతి, నాని తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

సోంపేట: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు, న్యాయ విజ్ఞాన సదస్సులు విజయవంతం చేయాలని సోంపేట సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సముదాయంలో అధికారులు, విలేకరులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22వ తేదీన కంచిలి మండలం ఎం.ఎస్.పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కవిటి మండలం మాణిక్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్య శిబిరాలు, న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేకు సహకరించాలి

- 1,500 ఓట్లు దాటితే అదనంగా పోలింగ్ కేంద్రం
- ఆరు నెలల్లో నియోజకవర్గంలో 6,879 ఓట్లు తొలగించాం
- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి
- వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం



టెక్కలి: మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి చేపట్టనున్న ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఓటర్లు సహకరించాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి కోరారు. ఓటర్ల సర్వేకు సంబంధించి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని సుమారు 316 పోలింగ్ కేంద్రాల పరిధిలో నెల రోజుల పాటు బూత్ లెవల్ అధికారులు సర్వే చేపడతారని తెలియజేశారు. ప్రతీ వెయ్యి మంది జనాభాకు 714 మంది ఓటర్లు ఉండే విధంగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. టెక్కలి నియోజకవర్గంలో గత 6 నెలల వ్యవధిలో ఓటర్ల జాబితాలో చనిపోయిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారితో కలిపి ఎంతో పారదర్శకంగా 6,879 మంది ఓట్లును తొలగించామని పేర్కొన్నారు. టెక్కలిలో 1,554, కోటబొమ్మాళిలో 2,483, సంతబొమ్మాళిలో 2,078, నందిగాంలో 7,64 ఓట్లు తొలగించామన్నారు. అంతేకాకుండా ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం ప్రక్రియలో భాగంగా టెక్కలి నియోజకవర్గంలో 92 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని గుర్తు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో 1500 మంది ఓట్లు దాటితే అదనంగా మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. సర్వేలో భాగంగా ఎక్కడైనా అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్, సబ్ కలెక్టర్‌ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

ఒకే దగ్గర ఓటుహక్కు

ఒక వ్యక్తికి ఒకే దగ్గర ఓటుహక్కు ఉండేవిధంగా పక్కాగా సర్వే నిర్వహించేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చామని సబ్ కలెక్టర్ తెలియజేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేవిధంగా ఈ సర్వేను నిర్వహిస్తామన్నారు. టెక్కలి, నందిగాం మండలాల్లో ఉన్న గిరిజనులను అత్యధికంగా ఓటర్లుగా నమోదు చేసే విధంగా సహకరించాలన్నారు. ఓటర్ల నమోదు ఇతర అంశాల కోసం సీఈవో ఆంధ్రా.ఇన్ వెబ్‌సైట్ ద్వారా విషయాలను తెలుసుకోవచ్చునని సూచించారు. ఇదిలా ఉండగా ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరికీ ఒకే పోలింగ్ కేంద్రం వద్ద కాకుండా, వేర్వేరు చోట్ల ఓట్లు ఉండడం వలన పోలింగ్ శాతానికి ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వీటితో పాటు ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాల్లో సమస్యలపై విన్నవించారు. సమావేశంలో కార్యాలయం ఏవో బి.రాజమోహన్, ఎన్నికల డీటీ అనిల్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎ.రాహుల్, డి.రంగబాబు, బి.శేషగిరి, పి.అజయ్‌కుమార్, హెచ్.ఉదయ్‌భాస్కర్, కె.మధుసూదనరావు, డి.రాజ్‌కుమార్‌రెడ్డి, ఎస్.షణ్ముఖరావు, ఎం.రామ్‌ప్రసాద్, బి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఖచ్చితమైన ఓటర్ల జాబితాకు సహకరించాలి



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న ఈఆర్వో సుమబాల

ఇచ్ఛాపురం రూరల్: ఖచ్చితమైన వివరాలతో ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకారాన్ని అందించాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎం.సుమబాల కోరారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో గ్రామ, వార్డు వలంటీర్లను కార్యక్రమానికి వినియోగించరాదని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎన్నికల ఉప తహసీల్దార్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.